

జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్‌కు సమస్యలను వివరిస్తున్న జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మెరుగైన చర్యలు తీసుకోవాలి

ఎల్బీనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి ఆయన మంగళవారం ఎల్బీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా జంక్షన్ పరిధిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. ఎల్బీనగర్‌లోని బహదూర్‌గూడ ప్రభుత్వ పాఠశాలకు రెండు గేట్లను ఏర్పాటు చేయడంతోపాటు పిల్లల భద్రతకు సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించాలని కోరారు. ఎల్బీనగర్ మెట్రో సమీపంలో ట్రాఫిక్ నియంత్రణకు వాల్ టూ వాల్ రోడ్డును సక్రమంగా నిర్మించడంతోపాటు బోలార్డ్స్‌ను ఒక వైపు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్బీనగర్ జంక్షన్ నాలుగు వైపులా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎల్బీనగర్ చౌరస్తాలో వినియోగంలో లేని గ్రిల్డ్ కాంప్లెక్స్‌ను తొలగించి జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వారి వెంట ఉప కమిషనర్ జకియా సుల్తాన, ఈఈ కార్తీక్ ఇతర అధికారులు ఉన్నారు.



శ్మశానవాటికను సందర్శించిన కార్పొరేటర్ నరసింహారెడ్డి

శ్మశానవాటికలో సదుపాయాలు కల్పిస్తాం

హయత్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శశ్మానవాటికలో అసరమైన సదుపాయాలు కల్పిస్తామని కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ వీరభద్రనగర్ కాలనీలో ఉన్న మాదిగ శ్మశానవాటికను కార్పొరేటర్ సందర్శించారు. రూ.1.60 లక్షలతో చేపట్టిన అదనపు స్నానాల గదుల నిర్మాణ పనులను, నూతనంగా వేయించిన బోరును ఆయన పరిశీలించారు. శ్మశానవాటికలో చెత్తను వేస్తున్నారని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, శ్మశానవాటికకు చుట్టూ ఫెన్సింగ్, గేటు ఏర్పాటు చేయిస్తానని, శ్మశానవాటికలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాదిగ శ్మశానవాటిక సంఘం సభ్యులు బాబురావు, ఎర్ర రామస్వామి, పారంద రమేష్, అంజయ్య, హరిబాబు, శ్రీరాములు, ఎర్ర రవీందర్, సుధాకర్, పారంద సాయి, బట్టీల కమార్, హరీష్, సతీష్, జగదీష్ పాల్గొన్నారు.



చంపాపేట డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

కాలనీలలోని సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చంపాపేట డివిజన్‌లోని దుర్గానగర్‌కాలనీ, యాదగిరినగర్‌కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్, కాలనీల ప్రతినిధులు కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

వనస్థలిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరుచేసి డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తానని కమిషనర్ తెలిపారని కార్పొరేటర్ అన్నారు.



కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం సరూర్‌నగర్ ఏడీఈ తిరుపతయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కమలానగర్, నేతాజీనగర్, త్యాగరాయనగర్, సరస్వతినగర్, కృష్ణవేణినగర్, మహాలక్ష్మీనగర్, వివేకానందనగర్ తదితరప్రాంతాల్లో దెబ్బతిన్న పాత ఇనుపస్తంభాల స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలలో చెట్లు, భవనాల నడుమ ఉన్న పాత విద్యుత్ వైర్ల మూలంగా ఎర్తింగ్, లూజ్ కనెక్షన్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు.



ఏడీఈ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చాదర్‌ఘాట్‌లో వాహన తనిఖీలు

చాదర్‌ఘాట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజులతో కూడిన పోలీస్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. చాదర్‌ఘాట్ చౌరస్తాలోని సవేర హోటల్, ఆజంపుర మసీద్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై పార్కు చేసిన వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. ఇటీవల నగరంలో రాత్రి వేళల్లో హత్యలు, దాడులు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు.

శివారు ప్రాంతాల్లో

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- 20 రోజుల వ్యవధిలో మూడు ఇళ్లల్లో చోరీలు
- తాజాగా ఆదివారం బంగారం కడిగి ఇస్తామని...

రెచ్చిపోతున్న దొంగలు

హయత్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన టార్గెట్ చేసుకుని అందిన కాడికి దోచుకుని పారిపోతున్నారు. 20 రోజుల వ్యవధిలోనే మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. దాంతో ఇంటికి తాళం వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఇది నగర శివారు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంత ప్రజల దుస్థితి. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు నేర పరిశోధన ఇన్‌స్పెక్టర్ (డీఐ), డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (డీఎస్ఐ)ని నియమించక పోవడంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరుస చోరీలు... బెంబేలెత్తుతున్న ప్రజలు

హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇరవై రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి. జూన్ 10వ తేదీ రాత్రి పెద్ద అంబర్‌పేట్ సమీపంలోని ప్రజయ్ గుల్మార్ గేటెడ్ కమ్యూనిటీలో సోలార్ వైర్లు కత్తిరించిన దొంగలు తాళం వేసి ఉన్న 5 ఇళ్లల్లో చోరీకి తెగబడ్డారు. ఓ ఇంట్లో రూ. 5 వేల నగదు, 50 తులాల వెండి వస్తువులను దోచుకుని పారిపోయారు. పోలీసులు సంఘటాన స్థలినాకి వచ్చి దొంగల వేలిముద్రలను సేకరించారు. ఇంతవరకు దొంగలను పట్టుకోలేకపోయారు. పది రోజుల క్రితం అంజనాదినగర్‌లో గుడిసెలో జరిగిన దొంగతనం కేసులో తులం బంగారాన్ని దొంగలు అపహరించుకుపోయారు. అక్కడ కూడా పోలీసులు వేలిముద్రలను సేకరించారు. ఈ రెండు దొంగతనాల్లో వేలిముద్రలు ఒకే ముఠావని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తుంది. తాజాగా గురువారం రాత్రి ప్రియదర్శిని కాలనీ ఫేజ్-1లో పసుపులేటి స్వాతి ఇంటి తాళాలు పగులగొటినట్టన దొంగలు 30 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. వాటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుంది. తాజాగా ఆదివారం ఓ మహిళకు మంగళసూత్రాన్ని అల్లి ఇస్తామని చెప్పిన దుండగులు వారు వెంట తెచ్చుకున్న యాసిడ్‌లో కడిగి తులం బంగారాన్ని కాజేశారు. ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో దొంగలు అందినకాడికి దోచుకుని వెళ్తున్నారు. ఇప్పటికైనా రాచకొండ కమిషనరేట్ అధికారులు శివారులోని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు నేర పరిశోధన సీఐ, ఎస్ఐను నియమించి క్రైం పోలీసుల సంఖ్యను పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

సంవత్సరం నుంచి ఖాళీగా డీఎస్ఐ పోస్టు

వాస్తవంగా హయత్‌నగర్ క్రైం విభాగంలో 15 మందికిపైగా పోలీస్ సిబ్బంది అవసరం ఉంది. అయితే ఒక ఏఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఇద్దరు రైటర్లు, ఒక్క హోంగార్డు ఉన్నారు. వారిలో రైటర్‌లు పోలీస్‌స్టేషన్‌కే పరిమితం అవుతారు. నేరస్థులను పటుట్టకోవడానికి తగిన సిబ్బంది లేక పోవడంతో నేర పరిశోధన అంతంత మాత్రంగానే సాగుతుంది. ఇంకా ఇక్కడ దాదాపు మరో పోలీస్ సిబ్బంది ఉంటేనే నేరాలను కొంతమేర అదుపుచేసే అవకాశం ఉంది. హయత్‌నగర్‌లో డీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇటీవల మహేశ్వరం ఎస్‌వోటీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించలేదు. డీఎస్ఐ పోస్టు సంవత్సర కాలంగా ఖాళీగానే ఉంది. పోలీసుల సంఖ్యను పెంచి దొంగతనాలను నివారించాల్సిన అవసరం ఉంది.



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ (ఫైల్)

త్వరలో అందుబాటులోకి మరో ఐదు క్రీడా మైదానాలు: సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారులకు మరో ఐదు క్రీడా మైదానాలను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్లైన్ హాకీ డెవలప్‌మెంట్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రింక్‌గ్రౌండ్‌కు కావాల్సిన సదుపాయాలు ఒకే సంవత్సరంలోనే పూర్తి చేస్తానన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు ఇతర దేశాల్లో ఆడటానికి ఎంపిక కావడం గర్వించదగిన విషయమన్నారు. 8 ఏళ్ల నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారికి ఈ గ్రౌండ్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు.

గతంలో వనస్థలిపురం ఫేస్-4లో గ్రౌండ్ పనులు పూర్తి చేశామన్న ఆయన, రాబోయే రోజుల్లో నాగార్జున గ్రౌండ్, డీపీఎస్ స్కూల్ పక్కన గ్రౌండ్, శివాజీ గ్రౌండ్, గాయిత్రీ గ్రౌండ్, ఎస్కేడినగర్ గ్రౌండ్‌లలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న పార్కులు, స్విమ్మింగ్ పూల్స్ మరెక్కడా లేవన్నారు. ప్రపంచ స్కేటింగ్ గేమ్స్ ఇండియా టీమ్‌కు ఎంపికైన తెలంగాణ హాకీ స్కాటర్స్ టంగుటూరి నందిత, కావ్య, ఎస్.తేజస్వినీ తదితరులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజగోపాల్, జాతీయ కోచ్ సత్యం, శ్రీనివాస్ నికోల, టంగుటూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ పూర్వ జాతీయ నాయకులు శశిధర్

చాదర్‌ఘాట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని ఏబీవీపీ పూర్వ జాతీయ నాయకుడు డాక్టర్ రావినూతల శశిధర్ పిలుపునిచ్చారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ నుంచి కోణార్క్ థియేటర్ వరకు వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసంగించారు. విద్యారంగ సమస్యలైనా, సామాజిక సమస్యలైనా అందరి పక్షాన పోరాడే విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని అన్నారు. విద్యారంగ సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తూ జాతీయ సమైక్యతకోసం కృషి చేస్తామని శశిధర్ స్పష్టం చేశారు. ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కన్వీనర్ హనుమాన్‌చారి ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు కల్యాణ్, నాయకులు విశ్వ, సాయి, రేవంత్, రిత్విక్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

చంపాపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ చంపాపేట నగర శాఖ ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తాలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఏబీవీపీ జిల్లా నాయకులు వెంకటేష్ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకులు వెంకటేష్, విజయ్, కార్తీక్, మధు తదితరులు పాల్గొన్నారు.



కాలాడేరాలోని ప్రభుత్వ క్వార్టర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

చాదర్‌ఘాట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్ కాలాడేరలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదించనున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మంగళవారం కాలాడేరలోని ప్రభుత్వ క్వార్టర్స్‌ను సందర్శించి, అక్కడి స్థలాన్ని ఆయన పరిశీలించారు. స్థానికంగా ప్రభుత్వ క్వార్టర్స్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేస్తే కాలాడేర, పూల్‌బాగ్ బస్తీలకు చెందిన చిన్నారులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే వెంట ఎంఐఎం నాయకులు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్, సయ్యద్ అలీంతదితరులు ఉన్నారు.



కర్మన్‌ఘాట్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలి

చంపాపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఇంటి ఆవరణలో, పాఠశాలలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రిన్సిపాల్ కడారి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని లోటస్‌ల్యాప్ స్కూల్ విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ప్ల కార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషఫణి, మేనేజర్ ఎస్. రవీంద్రారెడ్డి, నాగరాణి, కో-ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి రథోత్సవం

చంపాపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో ఉన్న శ్రీజగన్నాథస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. త్రిదండి శ్రీభక్తిసౌరబ్ నారాయణ్ మహారాజ్ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ఆరాధన, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. అనంతరం శ్రీజగన్నాథస్వామి రథోత్సవం నిర్వహించగా, ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పాల్గొని రథాన్ని పురవీధులలో లాక్కుంటూ వెళ్లారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కిరణ్‌కుమార్‌గుప్తా, బి. ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎం.సురేందర్‌రెడ్డి, మధుసాగర్, సురేష్‌గౌడ్, చీర తిరుమలేష్, ఎన్.శ్రీనివాస్‌యాదవ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

సైదాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం పురస్కరించుకుని సైదాబాద్ చేపల మార్కెట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రమణ్‌సింగ్ గంగిశెట్టి రాజేష్, నవీన్ బండారి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియషన్ సభ్యులు సుభాష్, దినేష్ గోలీకార్, ధర్మేందర్ సింగ్, అవినాష్ నాయుడు పాల్గొన్నారు.

సన్మానం



రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మల్‌రెడ్డి రాంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పెద్దఅంబర్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డికి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో గంట లక్ష్మారెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, కర్తాల అశోక్ రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.
-అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి

పిల్లల టీసీ, బోనఫైడ్ సర్టిఫికేట్ల కోసం తండ్రి అర్ధనగ్నంగా ధర్నా

వనస్థలిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): తమ పిల్లల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్లు(టీసీ), బోనఫైడ్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా పాఠశాల యాజమాన్యం వేధిస్తుందని ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా పాఠశాల ఎదుట అర్ధనగ్నంగా ధర్నాకు దిగాడు. వెంటనే టీసీ, బోనఫైడ్ సర్టిఫికేట్లు ఇవ్వాలని అన్నాడు. ఈ ఘటన నాగోల్‌లో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... తట్టిఅన్నారం, జీవీఆర్ కాలనీకి చెందిన ఆనం ధర్మారెడ్డి తన ఇద్దరు పిల్లలను నాగోల్ డివిజన్ కృషినగర్‌లోని అక్షర టెక్నో పాఠశాలలో 2015లో చేర్పించారు. అనంతరం వారిని 2016లో వేరే పాఠశాలలో చేర్పించాడు. అప్పటి నుంచి 2019 వరకు టీసీ, తమ పిల్లల బోనఫైడ్ సర్టిఫికేట్లు ఇవ్వాలని పాఠశాల చుట్టూ తిరుగుతున్నాడు. రూ. 20వేలు ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికేట్లు ఇస్తామని యాజమాన్యం వేధిస్తుండడంతో, తన వద్ద అంత డబ్బు లేదని సర్టిఫికేట్లు ఇవ్వాలని మంగళవారం అక్షర పాఠశాల ఎదుట అర్ధనగ్న ప్రదర్శనకు దిగినట్టు విద్యార్థుల తండ్రి ధర్మారెడ్డి తెలిపాడు. కాగా, పాఠశాల యాజమాన్యం ధర్మారెడ్డికి నచ్చజెప్పి విద్యార్థుల టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్లు అందజేసినట్లు పాఠశాల చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.



అక్షర పాఠశాల ఎదుట అర్ధనగ్నంగా ధర్నా చేస్తున్న విద్యార్థుల తండ్రి ధర్మారెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎల్లయ్య, సీఐటీయూ నాయకులు

నేడు కార్మికుల కోర్కెల దినోత్సవం

- కార్మికుల హక్కులను హరిస్తే సహించేది లేదు: ఎల్లయ్య

వనస్థలిపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న(నేడు) చేపట్టే కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్య కాలనీలో అందుకు సంబంధించిన పోస్టర్లను సీఐటీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం.. పదేళ్లుగా ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నదని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో యాదమ్మ, లలిత, రాకేష్, లక్ష్మీ, లక్ష్మమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా తానాజీ పాటిల్

ఎల్బీనగర్, జూలై 9(ఆంధ్ర జ్యోతి): ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మోండేకార్ తానాజీ పాటిల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి మంగళవారం తానాజీ పాటిల్‌కు నియామక పత్రం అందజేశారు. క్షత్రియ సమాజ్ అధ్యక్షుడైన తానాజీ.. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు భాగ్యలక్ష్మి తెలిపారు. తానాజీ పాటిల్ మాట్లాడుతూ ఓబీసీలను ఏకతాటిపై తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు.



తానాజీ పటేల్‌కు నియామకపత్రం అందజేస్తున్న భాగ్యలక్ష్మి

రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడిగా దేవులపల్లి బాలచంద్రశర్మ

ఎల్బీనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా దేవులపల్లి బాలచందర్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా గంప రామారావు నియమితులయ్యారు. మంగళవారం తెలంగాణ బ్రాహ్మణసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు వారికి నియామక పత్రాలను అందజేశారు.



దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపో మేనేజర్ బదిలీ

చాదర్‌ఘాట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ హరి బదిలీపై కూకట్‌పల్లి డిపో మేనేజర్‌గా వెళ్లనున్నారు. ఆయన స్థానంలో తాండూరు డిపో మేనేజర్ సమత దిల్‌సుఖ్‌నగర్ డిపోకు బదిలీపై రానున్నారు. ఈ నెల 11న ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు సన్మానం చేయనున్నట్లు డిపో ఉద్యోగులు తెలిపారు.



నుస్రత్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న గోర్తి ఈశ్వర్ ట్రస్ట్ సభ్యులు

విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరుకోవాలి

చంపాపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరుకోవాలని గోర్తి ఈశ్వర్ ట్రస్టు సభ్యులు అన్నారు. చంపాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని నుస్రత్ అలీఖాన్‌ను మంగళవారం గోర్తిఈశ్వర్ ట్రస్టు వ్యవస్థాపక ఫౌండర్ ఉషా బాలా, పవన్‌కుమార్ సన్మానించి రూ. 10వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలిచిన వారికి ప్రతీ సంవత్సరం నగదును అందించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయ, ట్రస్టు ప్రతినిధులు శ్రీనాథ్‌రెడ్డి, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను చూపించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిన్నపిల్లలు కూడా ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలి

కొత్తపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు కూడా ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ చెప్పారు. మంగళవారం ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్స్ పార్కులో రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్, హీరోమోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్లు ప్రవీణ్, సాదిక్, సిబ్బంది పార్కులోని గోడలపై ట్రాఫిక్ నిబంధనల పోస్టర్లు, రోడ్ సైన్స్ చూపుతూ, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రోడ్డుపై వెళ్తున్న సమసయంలో ఎటు వైపు వెళ్లాలి, వాహనాలను ఎడమ వైపు మాత్రమే నడపాలని అవగాహన కల్పించారు. ఆ తర్వాత విద్యార్థులను లెక్చర్ హాల్‌లోకి తీసుకెళ్లి ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను చూపించారు. కార్యక్రమంలో టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రవి, హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్స్ సాదిక్, ప్రవీణ్, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్, డియోరియా జిల్లా, మటియార గ్రామానికి చెందిన మనీష్ ఉపాధ్యయ(25), బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో ఉంటూ రియల్ వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బైపాస్ రోడ్డు సమీపంలోని ఓఆర్ఆర్ హోటల్ వద్ద గంజాయి విక్రయించడానికి వెళ్లాడు.

విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఓఆర్ఆర్ హోటల్ వద్ద తనిఖీ చేయగా మనీష్ ఉపాధ్యయ వద్ద 1.12 కిలోల గంజాయి పట్టుబడింది. నిఖిల్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో తెలిపాడు. 1.12 కిలోల గంజాయితో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.